క్లుప్తంగా

ముగిసిన త్యాగరాజ ఆరాధనోత్సవాలు


త్యాగరాజ ఘనరాగ పంచరత్న కృతుల గోష్టిలో పాల్గొన్న సంగీత కళాకారులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరానికి చెందిన ఫైన్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో మూడు రోజులు త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు ముగిశాయి. మంగళవారం నగరానికి చెందని ప్రముఖ సంగీత విద్వాంసుడు మల్లాది నారాయణ శర్మ నేతృత్వంలో స్థానిక కళాకారులు త్యాగరాజ స్వామి ఘనరాగ పంచరత్న కృతుల గోష్టి గానం చేశారు. చిన్నారి బృంద ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా సంగీత కళాకారులను ఫైన్ ఆర్ట్స్ అకాడమీ ప్రతినిధులు పరిమి సావిత్రి, దువ్వి హేమ సుందర్, అచ్యుత కృష్ణ కుమార్ ఘనంగా సత్కరించారు. అనంతరం ప్రసాద వితరణతో కార్యక్రమాలు ముగించారు.

రైళ్లలో అక్రమ రవాణాపై నిఘా


పోర్టర్స్‌తో మాట్లాడుతున్న రైల్వే ఎస్సై

ఏలూరు టౌన్: రైలులో అక్రమంగా మద్యం, గంజాయి, మాదక ద్రవ్యాలు, బంగారం, నగదు వంటివి రవాణా చేయకుండా పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశామని ఏలూరు రైల్వే ఎస్సై డి.నరసింహారావు తెలిపారు. విజయవాడ రైల్వే ఎస్పీ రాహుల్ దేవ్‌సింగ్ ఆదేశాలతో ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్‌లో లైసెన్స్ పోర్టర్లు, వెండర్స్‌కు రైలు బండ్లలో జరిగే అక్రమ రవాణాపై సమాచారం ఇవ్వాలంటూ అవగాహన కల్పించారు. రైలుబండ్లలో అక్రమంగా మద్యం, బంగారు, నగదును రవాణా చేయకుండా, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు రైల్వే పోలీస్ పటిష్టమైన చర్యలు చేపట్టిందని ఎస్సై తెలిపారు. ఏలూరు రైల్వే ఏఎస్సై పి.సైమన్, పీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ సిబ్బంది ఉన్నారు.

రూ.10 కోట్లతో కళ్యాణ మండపం పునర్నిర్మాణం


నాగసత్యం యాదవ్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలోని తిరుమల తిరుపతి దేవస్థాన కళ్యాణ మండపం పునర్నిర్మాణానికి రూ.10 కోట్లు నిధులు మజూరు చేసినట్టు టీటీడీ పాలకమండలి సభ్యుడు నెరుసు నాగసత్యం యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక గ్జేవియర్ నగర్ ప్రాంతంలో రెండెకరాల విస్తీర్ణంలో శిథిలావస్థలో ఉన్న టీటీడీ కళ్యాణ మండపాన్ని అభివృద్ధి చేయడానికి పాలక మండలి సమావేశంలో ప్రతిపాదించామన్నారు. వివాహ, ఇతర ధార్మిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహణకు సుమారు 30 వేల అడుగుల విస్తీర్ణంలో నూతన భవనం నిర్మించనున్నట్టు చెప్పారు. 700 మంది కూర్చునే వీలుగా సెంట్రల్ ఏసీ హాలు, 400 మంది కూర్చునే విధంగా భోజన శాల, 14 ఏసీ రూములతో అత్యాధునిక సౌకర్యాలతో సువిశాల కళ్యాణ మండపం నిర్మించనున్నట్టు తెలిపారు. తనకు పాలక మండలిలో సభ్యత్వం కల్పించి స్వామి వారికి సేవ చేయడానికి సహకరించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. నగరంలోని టీటీడీ కళ్యాణ మండపం పునర్నిర్మాణానికి ప్రతిపాదనలు ఆమోదించడానికి సహకరించిన టీటీడీ పాలక మండలి అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, ఈఓ ఏవీ ధర్మారెడ్డి, ఎమ్మెల్యే ఆళ్ల నాని, ఎంపీ కోటగిరి శ్రీధర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

అసైన్డ్, సీలింగ్ భూములు పేదలకు పంచాలి

దెందులూరు : దోసపాడులో అసైన్డ్, సీలింగ్ భూములు పేదలకు పంచాలని, జిల్లా జాయింట్ కలెక్టర్ కోర్టులో ఉన్న భూ సమస్యలు పరిష్కరించాలని దోసపాడు దళితులు కోరారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం దోసపాడు భూ పోరాట సమితి సంయుక్త ఆధ్వర్యంలో ప్రదర్శన చేశారు.

సంక్షేమ పథకాలతో ఆర్థిక భరోసా

- 15 పంచాయతీల్లో 74,890 మందికి మేలు
- డీబీటీ పథకాల ద్వారా రూ.159,87,42,591
- నాన్ డీబీటీ ద్వారా రూ.106,20,56,368 లబ్ధి


పైడిచింతపాడులో మహిళలకు ఇళ్ల పట్టాలు అందిస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి (ఫైల్)


సబ్సిడీపై యంత్రాలు అందుకున్న రూరల్ గ్రామాల రైతులు (ఫైల్)


ప్రభుత్వం అందించిన సున్నా వడ్డీ పత్రం చూపుతున్న మాదేపల్లి మహిళలు

ఏలూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలతో పేదల ఇళ్లలో ఆనందాలు వెల్లివిరుస్తున్నాయి. వైఎస్సార్ సీపీ నాలుగేళ్ల తొమ్మిది నెలల పాలనలో అమలు చేస్తోన్న పథకాలు పేద, మధ్య తరగతి ప్రజల్లో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందిస్తున్నాయి. అమ్మఒడి, జగనన్న వసతి దీవెన, విద్యా దీవెన తదితర పథకాల ద్వారా పేదల పిల్లలు ఉన్నత విద్య వైపు అడుగులు వేస్తున్నారు. వాహన మిత్ర, కాపునేస్తం, ఈబీసీ నేస్తంతో యువత ఉద్యోగం, వ్యాపారం రంగాల్లో ప్రతిభను చాటుతున్నారు. రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ పథకాల ద్వారా రైతులు వ్యవసాయం, చేపల సాగు రంగంలో ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు. సున్నా వడ్డీ, వైఎస్సార్ చేయూత సాయంతో మహిళలు ఆర్థిక స్వాలంబన సాధిస్తున్నారు.

రెండు రకాలుగా పథకాల లబ్ధి

ప్రభుత్వం పేదలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను రెండు విభాగాలు చేసింది. ఇందులో నేరుగా నగదు రూపంలో లబ్ధిదారుడి బ్యాంక్ ఖాతాకు అనుసంధించిన పథకాలను డీబీటీ (డైరెక్ట్ బెనిఫిట్స్ ట్రాన్స్‌ఫర్స్) అంటోంది. వస్తు, సేవల రూపంలో అందిస్తున్న పథకాలను నాన్ డీబీటీ (ఇన్‌డైరెక్ట్ బెనిఫిట్స్)గా వివరిస్తోంది.

లబ్ధిదారులు 74,890 మంది

దెందులూరు నియోజకవర్గం, ఏలూరు రూరల్ మండలంలో 15 గ్రామ పంచాయతీల్లో 74,890 మంది లబ్ధిదారులు సంక్షేమ పథకాలు అందుకుంటున్నారు. వీరిలో 51,578 మందికి 25 డీబీటీ పథకాల (అమ్మఒడి, జగనన్న విద్యా దీవెన, రైతు భరోసా, సున్నా వడ్డీ, కాపునేస్తం, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ తదితర) ద్వారా రూ.159,87,42,591లను ప్రభుత్వం నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో నగదు జమ చేస్తోంది. మరో 23,312 మంది లబ్ధిదారులకు ఎనిమిది నాన్ డీబీటీ పథకాలు (ఇంటి స్థలం, విద్యా కానుక, జగనన్న తోడు, గోరుముద్ద, రైస్ కార్డు, కంటి వెలుగు, వైఎస్సార్ సంపూర్ణ పోషణ, విద్యార్థులకు ట్యాబ్స్) ద్వారా రూ.106,20,56,368 ఖర్చుకాగల సేవలు అందుకుంటున్నారు.

అండగా వైఎస్సార్ చేయూత



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన వైఎస్సార్ చేయూత పథకం నా కుటుంబానికి ఎంతో అండగా నిలిచింది. ఈ పథకం ద్వారా మూడేళ్లలో రూ.50 వేలు అందుకున్నాను. ఈ మొత్తంతో నేను, నా భర్త చేపల వ్యాపారం చేపట్టాం. ఇప్పుడు మా పరిస్థితి ఆర్థిక మెరుగుపడింది. ఆర్థికంగా మరింత బలపడుతున్నామనే ధైర్యం ఏర్పడింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– బలే రాజేశ్వరి, పెదయాగనమిల్లి

మాట నిలబెట్టుకున్నారు



ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. అధికారంలోకి వచ్చాక వైఎస్సార్ చేయూత పథకం ద్వారా మా గ్రామంలో ఒక్కో డ్వాక్రా మహిళకు ఏడాదికి రూ.18,750 ఇస్తున్నారు. ఏడాదికి 45 ఏళ్లు దాటిన మహిళలు అందరికీ ఆర్థిక సాయం సాధ్యమేనా అన్నారు. ఆర్థిక సాయం అందిస్తుండడంతో ఇప్పుడు అందరూ ఆశ్చర్యపోతున్నారు. ఈ పథకం మహిళలను ఒక శక్తిగా మార్చింది.

– తెనాలి యోహాన్, సర్పంచ్, కోమటిలంక

వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పేదలకు వరం


7వ డివిజన్‌లో ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ శ్రీదేవి


పేదలకు ఆరోగ్యశ్రీ కార్డు అందిస్తున్న కార్పొరేటర్ రాము

ఏలూరు టౌన్: పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించేలా వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరింత విస్తృతం చేశారని ఏలూరు 7వ డివిజన్ కార్పొరేటర్ పిల్లంగోళ్ల శ్రీదేవి తెలిపారు. వన్‌టౌన్‌లోని 7వ డివిజన్‌లో మంగళవారం ఇంటింటికీ వెళ్లి ఆరోగ్యశ్రీ లబ్ధిదారులకు కొత్త కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.25 లక్షలకు పెంచుతూ సీఎం వైఎస్ జగనన్న తీసుకున్న నిర్ణయంతో పేదలకు ఆరోగ్య భరోసా ఏర్పడిందన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ హాస్పటల్స్‌కు ఆరోగ్యశ్రీ పథకంలో వైద్యం, శస్త్రచికిత్సలు చేయించుకుని రోగులకు పరిధిని పెంచడం వల్ల లక్షలాది మంది పేదలకు మేలు చేకూరుతుందని వివరించారు. నగరంలో వేలాది మంది పేదలకు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, పార్టీ నాయకులు ఉన్నారు.

ఆరోగ్య ప్రదాత సీఎం జగన్

ఏలూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారని కార్పొరేటర్ తంగెళ్ల రాము కొనియాడారు. మంగళవారం 15వ డివిజన్‌లో సుమారు 2,500 కుటుంబాలకు ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డుల పంపిణీని ఆయన ప్రారంభించారు. పేదలు సైతం కార్పొరేట్ వైద్య సేవలు అందుకోవాలని గొప్ప ఆలోచనతో ఆరోగ్యశ్రీ పథకం రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు వర్తింపజేశారని రాము వివరించారు. ఈ కార్డు ద్వారా కార్పొరేట్ ఆసుపత్రుల్లో సైతం పేదలు వైద్య సేవలు పొందవచ్చన్నారు. మహానేత ఆశయాల మేరకు జగన్‌మోహన్‌రెడ్డి పేదలు పైసా ఖర్చు చేయకుండా విద్య, వైద్య సేవలు అందిస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కేఎస్ నవ్యతేజ, ఏఎన్ఎం ప్రతిమనాయక్, ఆశావర్కర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు అబ్బిరెడ్డి రంగముత్యాలు, జయరామ్‌రెడ్డి, అన్నవరం, మణిరాజు తదితరులు పాల్గొన్నారు.

లింగనిర్ధారణ చట్టరీత్యా నేరం


సదస్సులో మాట్లాడుతున్న న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్

ఏలూరు టౌన్: వైద్యుల అనుమతితోనే లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని, వాటి వివరాలను బయటకు వెలువరించకూడదని, చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీహెచ్ పురుషోత్తమ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ఏలూరులోని సేవాధికార సంస్థ భవనంలో జిల్లాలోని రేడియాలజిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముందస్తు లింగనిర్ధారణ నియంత్రణ, దుర్వినియోగం నివారణ చట్టం అనే అంశాలపై ఆయన అవగాహన కల్పించారు. గర్భంలోని శిశువు ఆడ, మగ తెలుసుకుని భ్రూణ హత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. పితృస్వామ్య వారసత్వ చట్టాలు, సాంస్కృతిక పద్ధతుల నేపథ్యంలో సంప్రదాయకంగా ఆడపిల్లల కంటే మగ పిల్లలకు సమాజంలో ప్రాధాన్యత ఇస్తున్నట్టు చెప్పారు. మగ బిడ్డ పుట్టే వరకు పలు కుటుంబాలు పిల్లలను కలిగి ఉండటం కొనసాగించడానికి దారి తీస్తోందని, ఆడ శిశువులను వధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో స్త్రీల సంఖ్య తగ్గిపోతుందని, దీన్ని నివారించేందుకు చట్టాన్ని రూపొందించాలని ఆయన అన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	30
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	38
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	37
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	35

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	16
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	25
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	30
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	34
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	20
ద్వారకాతిరుమల –ఏలూరు– బీహెచ్‌ఈఎల్	22.15	4822	28
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	33
ఏలూరు – తిరుపతి	16.00	4830	33

మగ్గం వర్క్స్‌లో ఉచిత శిక్షణ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక యూనియన్ బ్యాంక్ (ఆంధ్రా బ్యాంక్) గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా ఇచ్చే వివిధ వృత్తి విద్యా కోర్సుల్లో ఉచిత శిక్షణలో భాగంగా ఫిబ్రవరి 1వ తేదీ నుంచి మగ్గం వర్క్స్‌లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్టు ఆ సంస్థ డైరెక్టర్ కె.శశిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన 5వ తరగతి ఆపై విద్యార్హత గల 18 నుంచి 45 సంవత్సరాల వయసు గల అభ్యర్థులు ఈ శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. 30 రోజుల ఈ శిక్షణా కాలంలో ఎంపికైన వారికి వసతి, భోజనం ఉచితంగా ఏర్పాటు చేస్తామని తెలిపారు. యువకులు ఏలూరులోని తమ సంస్థ కార్యాలయానికి వచ్చి ప్రవేశాలు పొందవచ్చని, తమ వెంట ఆధార్, రేషన్ కార్డులు జిరాక్స్ కాపీలు, మూడు కలర్ ఫొటోలు తీసుకురావాలని సూచించారు. వివరాలకు ఫోన్ నెంబర్లు 95027 23561, 99485 65256లో సంప్రదించవచ్చని తెలిపారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం


పేదలకు దుప్పట్లు పంచుతున్న అతిథులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): దేవదాయ శాఖ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కార్పొరేటర్ యర్రంశెట్టి సుమన్ అన్నారు. స్థానిక పవర్‌పేటలోని చుండూరి వారి సత్రం మిగులు నిధులతో పేద, బడుగు బలహీన వర్గాల వారికి దుప్పట్లు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సుమన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రంలో పేదల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తూ వారి ఆర్థిక పురోభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారని కొనియాడారు. జగన్ ఆశయాలను కొనసాగిస్తూ దేవదాయ శాఖ వంటి ప్రభుత్వ శాఖలు సైతం సేవా కార్యక్రమాలు కొనసాగించడం ఆహ్వానించ దగ్గ పరిణామమని తెలిపారు. ఈ సందర్భంగా సుమారు 300 మందికి భోజన సదుపాయం కల్పించారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఏలూరు జిల్లా అధికారి సీహెచ్ రంగారావు, ఏలూరు డివిజన్ ఇన్‌స్పెక్టర్ బి.నరసింహారావు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని చుండూరువారి సత్రం కార్యనిర్వహణాధికారి డి.శంకరరావు పర్యవేక్షించారు.

జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలి


పబ్లిక్ హెల్త్ మెడికల్ ఎంప్లాయిస్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ శర్మిష్ట

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలోని వైద్య సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేస్తూ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల్లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలని ఏలూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ శర్మిష్ట తెలిపారు. ఏలూరులోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఏపీ పబ్లిక్ హెల్త్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ 3194 ఏలూరు తాలూకా వార్షిక క్యాలెండర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు పలు సమస్యలను డీఎంహెచ్‌ఓ దృష్టి తీసుకెళ్లగా వాటి పరిష్కారానికి సానుకూలంగా స్పందిస్తూ హామీ ఇచ్చారు. డాక్టర్ శర్మిష్ట మాట్లాడుతూ జిల్లాలోని వైద్యసిబ్బంది ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు సక్రమంగా చేరేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు నల్లా అప్పారావు, జిల్లా కార్యదర్శి జె.గోవిందరావు, ఏలూరు తాలూకా అధ్యక్షుడు ఐ.రవీంద్రకుమార్, కార్యదర్శి కృష్ణారావు, ప్రభాకరరావు, శిరీషా, విజయ్‌వర్ధన్‌బాబు, కాపా నాగరాజు, శ్రీనివాసరావు, కృష్ణ, త్రినాథ్ తదితరులున్నారు.

స్పర్శ, కుష్ఠుపై అవగాహన


సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ నాగేశ్వరరావు

ఏలూరు రూరల్: ఏలూరు రూరల్ మండలం చాటపర్రు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్పర్శ, కుష్ఠు వ్యాధి నివారణపై వైద్యులు అగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా కుష్ఠు వాధి, టీబీ అధికారి ఎం నాగేశ్వరరావు మాట్లాడుతూ జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 13 వరకు కుష్ఠు నిర్మూలనపై పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అరికాళ్లు లేదా అరిచేతలు స్పర్శ కోల్పోయి ఉంటే కుష్ఠు వ్యాధి ప్రాథమిక లక్షణంగా గుర్తించాలన్నారు. ఈ వ్యాధి ప్రాథమిక దశలో గుర్తిస్తే నివారణ మరింత సులువు అవుతుందని తెలిపారు. కుష్ఠు బాధితుల పట్ల వివక్ష ముగిద్దాం, గౌరవాన్ని స్వాగతిద్దాం అనే నినాదంతో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు కె.ప్రదీప్‌చంద్ర, జి.కృష్ణ, డీపీఎంఓ కె.సత్యానారాయణ, హెచ్‌ఈఓ కె.సత్యానంద్, ఎంపీహెచ్‌సీఓ రామాంజనేయులు, పీహెచ్ఎన్ కె.సీతామహలక్ష్మి, హెచ్‌వీ సీహెచ్ రత్నమ్మ, హెచ్ఎస్ ఇ.కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉరుసు ఉత్సవాలు


ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తున్న ఎహెసాన్ రజా

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక కుండీ సెంటర్‌లో ఉన్న హజరత్ మౌలా అలి మహాత్ముని దర్గా (గొలుసుల పంజా)లో ఈ నెల 28న ప్రారంభమైన ఉరుసు ఉత్సవాలు ముగిశాయి. మంగళవారం ఉదయం దర్గాలో దివ్య ఖుర్‌ఆన్ గ్రంథ పారాయణం చేశారు. సాయంత్రం మచిలీపట్నానికి చెందిన ఎహెసాన్ రజా ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. మానవులంతా సమానమని, పేద, ధనిక, కుల, మత తారతమ్యాలకు అతీతంగా అందరూ కలిసి ఉండాలని అల్లా సూచించారని తెలిపారు. అనంతరం నగరానికి చెందిన ఉల్మాక్రమ్ పేష్ ఇమామ్ హజరత్ మౌలా అలి మహాత్ముని బయాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు రెండు వేల మంది హిందూ, ముస్లింలు పాల్గొని మహాత్ముని అన్నప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అహలె సున్నతుల్ జమాత్ సంస్థ ప్రతినిధులు షేక్ సాబీర్ హుస్సేన్, ఎండీ ఇక్బాల్, కార్పొరేటర్ ఎండీ ఇలియాస్ పాషా తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని గొలుసుల పంజా వంశపారంపర్య ముజావర్లు ఎండీ వజీర్ అలి, ఎండీ గాలబ్ అలి, ఎండీ మౌలా అలి, ఎండీ ఖాదర్ అలి తదితరులు పర్యవేక్షించారు.

డబ్బు పొదుపును అలవరుచుకోవాలి


వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న విజయకుమార్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యార్థి దశ నుంచే పొదుపు అలవరుచుకోవాలని, తల్లిదండ్రులు ఖర్చులకోసం ఇచ్చి సొమ్ములో కొంత పొదుపుచేసి పెట్టుబడుల రూపంలో మార్చుకోవచ్చని ఎన్ఐఎస్ఎం సంస్థ ప్రతినిధి చిలుకూరి విజయకుమార్ సూచించారు. స్థానిక సీఆర్‌ఆర్ కళాశాల ఎంబీఏ, సీఐఐఈ, ఈడీసీ, ఐక్యూఏసీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీస్ మార్కెట్స్ సహకారంతో ఎంబీఏ విద్యార్థులకు యువపౌరలకు ఆర్థిక విద్య అనే అంశంపై నాలుగు రోజుల వర్క్ షాపును మంగళవారం ప్రారంభించారు. ముఖ్య వక్తగా పాల్గొన్న విజయకుమార్ మాట్లాడుతూ ఉద్యోగంలో చేరిన కొద్ది సంవత్సరాలపాటు కొంత మొత్తాన్ని పొదుపు చేయడం ద్వారా పదవీ విరమణ నాటికి సంపదను ఎలా సృష్టించవచ్చో వివరించారు. ఎక్కడ, ఎప్పుడు, ఎలా పొదుపు చేయాలో సంశయం వచ్చినప్పుడు ఆర్‌బీఐ నిర్దేశించిన 72వ నియమం ద్వారా నిర్ధారించుకోవచ్చని సూచించారు. సెక్యూరిటీస్ మార్కెట్లలో పెట్టుబడులకు షేర్లు, బాండ్లు, డిబెంచర్స్, మ్యూచువల్ ఫండ్స్, డెరివేటివ్స్ మొదలైన రూపాల్లో ఉంటాయని, వాటిలో మనకు అనుకూలమైనవాటిని ఎంపిక చేసుకుని పెట్టుబడులు పెట్టడం ద్వారా సంపద పెంచుకోవచ్చునని వివరించారు. ఐతే అదే సందర్భంలో ఖచ్చితంగా భద్రత, ద్రవ్యత, రిటర్న్ అనే ఈ మూడు అంశాలను పరిశీలించి పరిగణనలోనికి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీజీ కళాశాల కరస్పాండెంట్ కానాల శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ కేఏ రామరాజు, పీజీ డైరెక్టర్ వీఆర్ఎస్ బాబు యలమర్తి, ఎంబీఏ డైరెక్టర్ రంగు శ్రీనివాసరావు, సీఐఐఈ కోఆర్డినేటర్ తేర రాజేష్, వై.సౌజన్య, అధ్యాపకులు పాలి సుబ్బారావు, ఎం ఉపేంద్ర, వి.శ్రీనివాసరావు, పి.అపర్ణ, జీవీఎస్ రవీంద్రబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా పథకాల అమలు

మంత్రి తానేటి వనిత

ద్వారకాతిరుమల: సిఫార్సులతో పనిలేకుండా, అవినీతికి తావులేకుండా సంక్షేమ పథకాలను అన్ని వర్గాల ప్రజలకు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి, గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి తానేటి వనిత అన్నారు. స్థానిక కాపు కల్యాణ మండపంలో ఏర్పాటుచేసిన వైఎస్సార్ సీపీ మండల నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకపోయినా, కరోనా మహమ్మారి వల్ల ఎన్ని ఇబ్బందులు ఎదురైనా సంక్షేమ పథకాలను సీఎం జగనన్న ఎప్పుడూ వాయిదా వేయలేదని చెప్పారు. గోపాలపురం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ గెలుపునకు ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త కృషి చేయాలని, కష్టపడే ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు ఉంటుందని అన్నారు. అందరం కలసికట్టుగా విజయానికి కృషి చేద్దామని అన్నారు. వచ్చేనెల 3న దెందులూరులో నిర్వహించనున్న సిద్ధం సభకు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని సూచించారు.

మంత్రి వనితకు చిన్నమిల్లి అభినందనలు

మంత్రి తానేటి వనితను వైఎస్సార్ సేవాదళ్ రీజనల్ కోఆర్డినేటర్, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కాపు సంఘం అధ్యక్షులు చిన్నమిల్లి వెంకట్రాయుడు స్థానిక కాపు కల్యాణ మండపం వద్ద మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులైనందుకు అభినందనలు తెలిపారు. కార్యక్రమాల్లో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, ఎంపీపీ బొండాడ మోహిని, వైస్ ఎంపీపీలు యలమర్తి దుర్గాదేవి, ఒగిరాల చంద్ర, జెడ్పీటీసీ సభ్యుడు చిగురుపల్లి శామ్యూల్, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, సర్పంచ్ కుంటం స్వర్ణలత పాల్గొన్నారు.